షిప్‌యార్డ్ ఆర్డర్లు అదానీకి కట్టబెడితే ఊరుకోం

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ వర్క్ ఆర్డర్లను అదానీకి కట్టబెట్టే ఎటువంటి ప్రయత్నాలకైనా తీవ్ర ప్రతిఘటన తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. షిప్‌యార్డ్ 80వ వార్షికోత్సవం సందర్భంగా షిప్‌యార్డ్ ఫ్లీట్ సపోర్ట్ ఓడలు నిర్మించడానికి 18 వేల కోట్ల వర్క్ ఆర్డర్ సాధించినట్లు సిఎమ్‌డి హేమంత్ ఖత్రి ప్రకటించారన్నారు. దీనిపై షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. అయితే ఈ వర్క్ ఆర్డర్లను కేంద్ర ప్రభుత్వం మోడీ మిత్రుడైన అదానీకి కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అదే జరిగితే షిప్ యార్డుకు తీవ్ర హాని జరుగుతుందన్నారు. అదానీ షిప్పింగ్ ఇండియా సిఇఒ ఈ నెల 8న షిప్‌యార్డ్‌లో పర్యటించనున్నట్లు వార్తలు వస్తున్నాయని, దీనికి షిప్ యార్డ్ యాజమాన్యం అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. గ్రీన్ బ్యాటరీ టగ్స్ నిర్వహణపై అదానీ సిఇఒ షిప్‌యార్డ్ ఉద్యోగులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిసిందని, ఇంతకన్నా హాస్యాస్పదం ఏముంటుంది? అని తెలిపారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ నౌకలతో సహా అనేక నౌకలను నిర్మించిన ఘన చరిత్ర హిందుస్తాన్ షిప్‌యార్డ్ కార్మికులదని, అత్యంత అనుభవం, స్కిల్స్, సామర్థ్యం షిప్‌యార్డ్ ఉద్యోగులు, కార్మికుల సొంతమని అన్నారు. వారి నుంచి ఇతరులు నేర్చుకోవాలి తప్ప అదానీ సంస్థ నుంచి వీరు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టులు, విద్యుత్తు, గనులు తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రజల ఆస్తిని అదానీకి కట్టబెడుతోందన్నారు. ఇప్పుడు షిప్‌యార్డులను దోచి పెట్టేందుకు సిద్ధపడుతోందని విమర్శించారు. షిప్‌యార్డ్‌ను ప్రభుత్వ రంగంలో కాపాడుకోవడం, రక్షణ రంగంలో విలీనం చేయడం, వర్క్ ఆర్డర్లు, కార్మిక హక్కులు సాధించడం, ప్రభుత్వాలు, యాజమాన్యాల కుట్రలను తిప్పి కొట్టడంలో షిప్‌యార్డ్ కార్మికులకు ఘనమైన పోరాట చరిత్ర వారసత్వం ఉందని, దీనిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తారని అన్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డును అదానీకి కట్టబెట్టే కుట్రలను కేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే విరమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

విశాఖ నగరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

విశాఖ వీధుల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భరోసా కల్పించే నిమిత్తం సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆధ్వర్యాన గురువారం నగర పరిధిలో అనేక ప్రాంతాలలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారి సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని స్థానికులను కోరారు.

ఎన్నికల 'చేయూత'

- వైసిపి సభగా మారిన అధికారిక కార్యక్రమం
- సిఎం వద్ద విధేయత చాటుకున్న అమర్
- పోటీ నుంచి తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ అంశం విస్మరణ
- భరత్‌ను ఆశీర్వదించాలన్న జగన్

సభా వేదికపై సిఎం జగన్, అమర్‌నాథ్, మలసాల భరత్ కుమార్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్వామి కార్యం.. స్వకార్యం రెండూ నెరవేరేలా గురువారం పిసినికాడలో సభ నిర్వహించారు. వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత నిధులు విడుదల అధికారిక కార్యక్రమమైనా.. ఆద్యంతం దాని నిర్వహణంతా ఎన్నికల చేయూత సభలా జరిగింది. ప్రొటోకాల్ ఏ మాత్రమూ పాటించలేదు. ప్రజల సొమ్ముతో సభ ముస్తాబు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో జనాల తరలింపు, భారీగా పోలీసుల మోహరింపు వంటి పనులన్నీ అధికారికంగా చేసి.. సభ, నిర్వహణ రాజకీయ సభ కింద మార్చేయడం విమర్శలకు దారితీసింది. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన ప్రసంగం చివరిలో పరిచయం చేశారు. చేయూత నిధులు విడుదల కార్యక్రమంలో భరత్ కుమార్ సభ వేదికపై కూర్చోడానికి, మాట్లాడానికి ఏ అధికార హోదా లేదు. అయినా సభ ముందు వరుసలో కూర్చోబెట్టి కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి తరువాత భరత్‌తో మాట్లాడించారు. ముఖ్యమంత్రి చేయూత నిధులు విడుదల చేస్తూనే తన ప్రసంగంలో ఆశీర్వదించాలని కోరారు. మహిళల పేర నిధులు జమవుతున్న పథకాలను వివరించి, తన ప్రభుత్వ ప్రత్యేకతను పలుమార్లు చెప్పుకున్నారు.

రాష్ట్రస్థాయి సంక్షేమ పథకాలు పదేపదే చెప్పడం తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో జిల్లాకు సంబంధించిన సమస్యలు ఎన్ని పరిష్కరించగలిగామో చెప్పే ప్రయత్నం సిఎం చేయలేదు. చెప్పించే ప్రయత్నం మంత్రి అమర్‌నాథ్ చేయలేదు. మంత్రిగా పరిష్కరించుకోగలిగిన తన నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి, సిఎం నుంచి హామీ పొందడమే విజయంగా ఆయన భావించినట్లుంది. అధికారిక సభలో పరిశ్రమల శాఖ మంత్రిగా అనకాపల్లి జిల్లాకు ఎంత విలువైన పెట్టుబడులతో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పి, ఎంతమంది స్థానికులకు ఉపాధి కల్పించగలిగామనేది ఆయన ప్రసంగంలో లేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిప్యూటీ కో ఆర్డినేటర్‌గా 15 నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థుల విజయం కోసం పనిచేయడానికి అవసరమైతే వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని చెప్పడంతో తనకు ఏ సీటూ రాదని అమర్ చెప్పకనే చెప్పారు. తన తలరాత జగన్మోహన్‌రెడ్డి రాస్తారంటూ తన కృతజ్ఞత, విధేయతను చాటుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ఎంత ఖర్చుపెడుతున్నదీ చెప్పిన అమర్ తన నియోజకవర్గ కేంద్రంలో మూతేసిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపింపుపై నోరువిప్పలేదు. గత ఎన్నికల ముందు తుమ్మపాలను ఆధునికీకరించి తెరిపిస్తామని ఇచ్చిన హామీని అమలుచేయలేకపోయామన్న చింత అమర్‌లో ఎక్కడా కన్పించలేదు. తుమ్మపాల ఊసే ఎత్తలేదు. రాబోయే రోజుల్లో అమర్‌కు మంచి చేస్తానని విధేయతకు బహుమానంగా జగన్మోహన్‌రెడ్డి సభలో ఓ హామీ ఇచ్చారు.

సిఎం పర్యటన నేపథ్యంలో తీవ్ర నిర్బంధం

సిపిఎం, ప్రజా సంఘాల నేతలు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - విలేకరుల బృందం

జిల్లాలోని పిసినికాడకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం వచ్చిన సందర్భంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. జిల్లాలోని వివిధ తరగతుల ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. అక్రమ అరెస్టులను పలువురు ఖండించారు.

పోలీసు నిర్బంధంలో సిపిఎం నాయకులు అప్పలరాజు

అనకాపల్లి : యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయిని మామిడిపాలెం హైస్కూల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీని గృహ నిర్బంధం చేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీరు యాదవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని 75 రోజులుగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన దీక్షలు చేపట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు వారు వెళ్లకుండా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్ మంత్రి సాయి లక్ష్మణరావును గృహ నిర్బంధం చేశారు.

కశింకోట : సిపిఎం స్థానిక నాయకులు దాకరపు శ్రీనివాసరావును ఇంటి వద్దనే పోలీసులు అరెస్టు చేశారు. **దేవరాపల్లి :** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు డి.వెంకన్నను సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు అరెస్టు చేశారు. **కె.కోటపాడు :** ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, చౌడువాడ గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. **యస్.రాయవరం :** మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. **రోలుగుంట :** రోలుగుంటలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. **నర్సీపట్నం టౌన్ :** జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్రను పోలీసులు నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామంలోని అతని నివాసం వద్ద హౌస్ అరెస్టు చేశారు

నిర్బంధాన్ని ఖండించిన సిపిఎం

అనకాపల్లి : సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సిఎం ఏ జిల్లాకు పర్యటనకు వెళ్లినా ముందుగా సిపిఎం నాయకులను అరెస్టు చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం నాయకులంటే ఎందుకు అంత భయమని అన్నారు. ప్రజలకు చేస్తున్న అన్యాయాలపైనా, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపైనా నిలదీస్తారని భయమా ? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కులకు భంగం కలిగించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత, నిర్బంధ చర్యలను మానుకొని ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు.

సింహాచలం అభివృద్ధికి రూ.54.4 కోట్ల నిధులు

బొర్రా గుహల్లో అదనపు సదుపాయాల కోసం రూ.30 కోట్లు కేటాయింపు

అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేసిన ప్రధాని మోడీ

సింహాచలంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సింహాచలం : కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' నిధులతో సింహాచలం దేవస్థానంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు, స్వదేశ్ దర్శన్ 2.0 పథకాల్లో భాగంగా రూ.30 కోట్లతో బొర్రా గుహల్లో అదనపు సదుపాయాల కల్పనకు చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు జమ్ము కాశ్మీర్ నుంచి వర్చువల్ విధానంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ గురువారం శంకుస్థాపనలు చేశారు. ప్రసాద్ పథకం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో రూ.54.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గురువారం స్థానిక సింహాచల క్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు, ఎపి టూరిజం చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, రాధా కత్యల్ జస్టిస్, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఎపి టూరిజం చీఫ్ ఇంజినీర్ మూర్తి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పివిఎన్.మాధవ్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ప్రశ్న పత్రాల బాక్సులను పరిశీలిస్తున్న ఎంఇఒ తదితరులు

పోలీస్ స్టేషన్‌లో టెన్త్ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి-సబ్బవరం : ఈనెల 18వ తేదీ నుండి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్లో భద్రపరిచినట్లు స్థానిక ఎంఈఓ-2 బిఎస్ఎన్ మూర్తి తెలిపారు. 10వ తరగతి ప్రశ్న పత్రాలు సెట్-2 గురువారం వచ్చాయని, వాటిని సరిచూసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచామన్నారు. మండలంలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాల ఐదు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రతిభా విద్యాలయం, మదర్ పబ్లిక్ స్కూల్, రావులమ్మపాలెం జెడ్పీ హైస్కూల్, సన్ రిడ్జ్ స్కూళ్లలో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుని లైంగిక దాడిపై నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా మునగపాక ఎస్సి కాలనీలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిపై ఆ పాఠశాల ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడ్డ వ్యవహారంపై జిల్లా పోలీసులు, విద్యాశాఖాధికారులు నివేదిక అందించాలని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారాన్ని కమిషన్ సీరియస్‌గా తీసుకుందని, ప్రభుత్వ అధికారులు, పోలీసులు అందించే నివేదిక ఆధారంగా క్రమశిక్షణా చర్యలుతో పాటు క్రిమినల్ చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేస్తామని వెల్లడించారు.

ఘనంగా కనకదుర్గమ్మ పండగ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి పండగ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పైడివాడ ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గి నాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, టిడిపి మండల అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, రొంగలి దేముడుబాబు, కోన సత్యనారాయణ, అక్కిరెడ్డి చిన్ననాయుడు, సియాద్రి లక్ష్మణరావు, పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఆటపాటలతో ఘనంగా జరిగింది. పలువురు విద్యార్థులు ఉత్సాహంతో నృత్యాలు చేశారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ సత్యనారాయణ ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు బంగారు లక్ష్మి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బోకం వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

మహిళల హక్కులను కాలరాసిన బిజెపి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ఐద్వా ఆధ్వర్యాన విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా హక్కులను కాలరాస్తోందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వద్ద కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, జిల్లా అధ్యక్షులు బి.పద్మ, కార్యదర్శి వై.సత్యవతి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.మణి మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన రోజు అని తెలిపారు. అధిక పని గంటలకు వ్యతిరేకంగా, దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటాలను గుర్తుచేశారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఓటు హక్కు ఉండాలని డిమాండ్ చేస్తూ శ్రామిక మహిళలు చేసిన పోరాటాలు, సమ్మెలకు దోపిడీదారులు దిగిరాక తప్పలేదన్నారు. దేశంలో మహిళలపై దాడులు, హింస, అత్యాచారాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు బడ్జెట్‌లో మొండి చేయి చూపడం, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయడానికి చిత్తశుద్ధి లేకపోవడం వంటి అంశాలు బిజెపి మనువాదం సిద్ధాంతం ఏదైతే ఉందో దాన్ని అమలు చేసే ప్రయత్నంలో భాగమేనన్నారు. అందుకే భారతదేశంలో మహిళలకు మనువాదం కాదు - అందరివాదం కావాలి అని స్పష్టం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో రాజకీయ పార్టీలు మహిళా సమస్యలను చేర్చాలని, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను 2024 ఎన్నికల నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, ఆర్.రంగమ్మ, గౌరి, బి.భారతి, డి.కొండమ్మ, ఎ.పుష్ప, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, వెంకట లక్ష్మి, జి.లక్ష్మి, సంతోషం, కె.వేణు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యాన..

లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు మహిళలు నడుం బిగించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో పాటు ఆర్ఎస్ఎస్ శక్తులు హరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేగం, ఉపాధ్యక్షురాలు ఎ.దేవుడమ్మ, అన్నపూర్ణ, సహాయ కార్యదర్శులు, గాయత్రి అరుణ, కోశాధికారి జి.జయ పాల్గొన్నారు.

వికలాంగుల మహా గర్జనకు తరలిరావాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అమరావతిలో జరుగు వికలాంగుల మహాగర్జన సభకు తరలిరావాలని శ్రీస్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మెరుగు నూకరాజు పిలుపునిచ్చారు. పూడిమడక గ్రామంలో గురువారం ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల చట్టం నేటి వరకు అమలు కాలేదన్నారు. పలు పథకాలలో వికలాంగులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు గంధవరపు రాజు, కోట, ధనలక్ష్మి, కాసు, మళ్లీ కాసులు, కంబాల రాము, వాడ మధుల, తాతారావు, మంగరాజు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ సిహెచ్.రూపాదేవి అధ్యక్షతన అనకాపల్లి సిఐటియు ఆఫీసులో గురువారం మహిళా దినోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ అంతరిక్షంలోకి ఒకవైపు మహిళలు అడుగు పెడుతుంటే, మరోవైపు రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, గృహహింస పెరిగిపోయాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళను వ్యాపార సరుకుగా చూస్తున్నారని, అశ్లీల సాహిత్యం, వ్యాపార ప్రకటనలతో మహిళలు, బాలికలపై మరింత లైంగిక వేధింపులు పెరిగాయని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 నుండి 15వ తేదీ వరకు సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ సంయుక్తంగా పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నాయకులు తనూజ, కాసులమ్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, నాయకులు డిడి వరలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై ముఖ్యమంత్రికి భరత్ కుమార్ వినతి

ప్రజాశక్తి- కశింకోట : వైయస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర మంత్రి అమర్నాథ్, వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కసింకోట వద్ద శారదా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, జగనన్న కాలనీ ప్రహరీ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి ఎన్నికల అనంతరం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన శ్రేణులు

ముఖ్యమంత్రి బహిరంగ సభకు కశింకోట మండలం నుండి వైసిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని ఎఎస్.పేట గ్రామం నుంచి మలసాల భరత్ కుమార్ సారథ్యంలో వాహనాల్లో తరలివెళ్లారు. ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయడు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్ల శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ ఇందులో పాల్గొన్నారు.

ప్రజాధనంతో శంఖారావం సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజాధనంతో వైసిపి ఎన్నికల శంఖారావం ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేయడం వారి విధి నిర్వహణకు విరుద్ధమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వతంత్రంగా పార్టీ తరపున ఎన్నికల సభలు నిర్వహించుకోలేని జగన్మోహన్ రెడ్డి కేవలం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పేరుతో అధికార దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. సమావేశాలకు రాకపోతే పథకాలు రద్దు అవుతాయని వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులను బెదిరించి ఆటోలు ఎక్కించారని ఆరోపించారు. ప్రతి డ్వాక్రా సంఘం నుండి పదిమంది సభ్యులు హాజరుకావాలని డిఆర్డిఎ అధికారులు, వెలుగు, సీసీలు, ఏపీఎంలు, విఓఏలు, ఆర్పీలు మహిళల సంతకాలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 35 వేల స్వయం సహాయక సంఘాల ద్వారా వాయిస్ మెసేజ్‌లు పెట్టారన్నారు. ప్రభుత్వ కార్యక్రమం పేరుతో నిర్వహించిన సభలో రాజకీయ ప్రసంగాలు చేశారన్నారు.

ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : శాసనసభ ఎన్నికల ప్రచారానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సతీమణి బూడి రమణమ్మ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం శ్రీకారం చుట్టారు. ముందుగా దేవరాపల్లిలోని సన్యాసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సుగ్గు, వెత్సా వారి కుటుంబ సభ్యులను కలిసి తొలి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, నాయకులు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వరదపురెడ్డి లలితా నాయుడు, కె.వి రమణ, గండిపడాల అప్పలరాజు, గొర్లె సన్యాసినాయుడు, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, రమేష్, మాలిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి సతీమణి రమణమ్మ తదితరులు

కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికుల ర్యాలీ

ర్యాలీ చేస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి -తగరపువలస : కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ముఠా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ముఠా కార్మికులు గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యూనియన్ కార్యాలయం నుంచి భీమిలి రోడ్డు, సంత పేట, గ్రంథాలయం వీధి, పై జంక్షన్, హై వే మీదుగా స్థానిక జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, రెండేళ్ల కోసారి కూలీరేట్లు పెంచాలని ఒప్పంద కాలపరిమితి జనవరి నెలాఖరుతో ముగిసినా వర్తక సంఘం నుంచి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా కూలిరేట్ల పెంపు చర్యలు చేపట్టాలని, లేకుంటే ఏ క్షణాన్నైనా నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలు, తాజా పరిస్థితులకు అనుగుణంగా కూలీరేట్లను పెంచాలని కోరారు. దీనిపై ఇదివరకే వర్తకసంఘానికి నోటీసు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ముఠా కార్మిక సంఘం ప్రతినిధులు ముగడ ఈశ్వరరావు, చిల్ల రాము, కొయ్య ఆదినారాయణ, చిల్ల సింహాచలం పాల్గొన్నారు

వేతన ఒప్పందం అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి

'ఉక్కు' యువ ఉద్యోగుల 'తాలి బజావ్'

ప్లేట్లను మోగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఉక్కు యువ ఉద్యోగులు

ప్రజాశక్తి-ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన ఒప్పందం అమలు, పూర్తిస్థాయిలో ఉత్పత్తికి చర్యలు, ఆర్ఐఎన్ఎల్‌ను సెయిల్‌లో విలీనం, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ తీయాలన్న డిమాండ్‌తో గురువారం ఉక్కు యువ ఉద్యోగులు అడ్మిన్ బిల్డింగ్ వద్ద తాలి బజావ్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యువ ఉద్యోగి మోహన్ రావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో 2007 నుండి 2019 వరకు జాయినైన 3680కి పైగా ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణ, ఇతర అవసరాలు తీర్చలేని స్థితికి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీ అనంతరం యువ ఉద్యోగులు స్విగ్గీ బోయ్స్, టాక్సీ ఆటో డ్రైవర్లుగా పనిచేయడం సిగ్గుచేటన్నారు. యువ ఉద్యోగులకు పెళ్లికి పిల్లను ఇవ్వడం లేదని, రుణాలకు బ్యాంకులు ముఖం చాటేస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా వేతన ఒప్పందం అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల11న నగరంలోని రైల్వే గ్రౌండ్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై డిక్లరేషన్ ఇస్తూ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పాల్గొనే కాంగ్రెస్ బహిరంగసభలో ఉక్కు యువ కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోరాడ వెంకటరావు, జెర్రి పోతుల మోహన్ కుమార్, ధర్మా కనకా రెడ్డి, దుష్యంత్, దుర్గాప్రసాద్, గవర అచ్చిబాబు, రాజా, మహేష్, మరిడయ్య, పోలిన్ నాయుడు, పల్లా పెంటారావు, నమ్మి సింహాద్రి, ప్రసాద్, చంద్రశేఖర్, రామకృష్ణ, జగదీష్, సాహు, సాయి, వర్మ, కర్రి శ్రీనివాస్, నీల్లాటి రాజు, దూడ త్రినాధరెడ్డి, రవికుమార్, ఇందల శివ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో భద్రతకు అధిక ప్రాధాన్యత

భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న సైంటిస్టులు, ఉద్యోగులు, అతిథులు

ప్రజాశక్తి-కరాస : ఎన్ఎస్‌టిఎల్‌లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని సంస్థ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ స్పష్టం చేశారు. డిఆర్‌డిఒ, ఎన్ఎస్‌టిఎల్ ప్రధాన నావికా ప్రయోగశాలలో జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈనెల 4 నుంచి 10 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వారం రోజులుగా సేఫ్టీ వాక్, పోస్టర్ కాంపిటీషన్, క్విజ్, మాక్‌డ్రిల్, ఫైర్‌ఫైటింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్ఎస్‌టిఎల్ ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ రామప్రసాద్ దువ్వాడ, సిఐడి డిఎస్‌పి డి లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు
ఈ సందర్భంగా ఎన్ఎస్ఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ప్రయోగశాలలో భద్రత అంశాలను బలోపేతం చేయడానికి చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. గ్రూప్ డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ బి రాధాకృష్ణ మాట్లాడుతూ సంస్థలో ప్రమాద నివారణ చర్యలను వివరించారు. సంస్థ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందర విశాఖ లక్ష్యం : మేయర్

శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గాజువాక : ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, సమగ్రాభివృద్ధితో విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, దీనికోసం అధిక నిధులు కేటాయిస్తు న్నట్లు నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. గురువారం జివిఎంసి 72వ వార్డు చైతన్యనగర్, వినాయక నగర్, శ్రీకృష్ణ దేవరాయనగర్ లో రూ.80 లక్షలతో సిసి, బిటి రోడ్లు, డ్రైనేజీ పనులకు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసారు. 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి ఉరుకూటి చందు,వార్డు ఇన్‌ఛార్జి సిరట్ల వాసు, వార్డు ప్రతినిధుల ఎస్‌వి.సుబ్బారావు, జె.వెంకటేశ్వరరావు ,బాపయ్య, జి.ఆనంద్, గుడివాడ అమ్మన్న, రాజు పాల్గొన్నారు.

బిసి డిక్లరేషన్‌కు మంచి స్పందన

మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి,జనసేన బిసి డిక్లరేషన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, 50ఏళ్లకు పింఛను, బిసిలకు ఆదరణ పథకం, వైసిపి రద్దు చేసిన బిసి పథకాల పునరుద్ధరణ వంటి బిసి డిక్లరేషన్‌లోని పది అంశాలపై ప్రజలు స్పందిస్తున్నారన్నారు. అనాదిగా టిడిపితోనే ఉన్న బిసిలు, ఈసారి మరింత పక్కాగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర కుమార్, గరే సదానంద, కనకల అప్పలనాయుడు, అంగటి రాము పాల్గొన్నారు

మాడుగుల: మండలంలోని పొంగలిపాకలో తెలుగుదేశం, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జయహెూ బీసీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ ఉండూరు దేవుడు మాట్లాడుతూ, 50 సంవత్సరాలు దాటిన బీసీలకు రూ.4,000 పెన్షన్ పెట్టడం మంచి పరిణామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి సబ్సిడీ రుణాలు ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. చేతివృత్తులకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు పంపిణీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

అనకాపల్లి : టిడిపి- జనసేన ప్రకటించిన బిసి డిక్లరేషన్‌పై ప్రజల్లో ప్రచారం చేయాలని మాజీ శాసనసభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో పీలా మాట్లాడుతూ టీడీపీ-జనసేన గెలుపు రాష్ట్రానికి అవసరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళి, కర్రి బాబీ, బిఎస్ఎంకె జోగినాయుడు, పెంటకోట రాము, పోలారపు త్రినాథ్, తలారి కాశీ నాయుడు, వేగి గోపికృష్ణ, షేక్ బాబర్, ఎంపీటీసీలు తోటాడ విజయ్, కడిమి గణేశ్, మెడిశెట్టి నూకరాజు, బత్తుల రమేష్, కోన శ్రీను, మెడిశెట్టి సన్యాసి నాయుడు, ఆకుల నానాజీ పాల్గొన్నారు.

రాంబిల్లి : బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ప్రకటించినందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు టిడిపి లాలం కోడూరు గ్రామ కమిటీ అధ్యక్షులు మాకిరెడ్డి అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

'అవినీతిపరులతో అభివృద్ధి ఎలా?'

మాట్లాడుతున్న తోట రాజీవ్

ప్రజాశక్తి- సీతమ్మధార : గంటా శ్రీనివాసరావులాంటి అవినీతి పరుడు చట్టసభలలోకి వస్తే విశాఖ అభివృద్ధి ఎలా సాధ్యమని నవ నిర్మాణసమితి అధ్యక్షులు తోట రాజీవ్ ప్రశ్నించారు. గురువారం పౌర గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ గంటా బినామీలు భీమిలిలో చక్రం తిప్పుతున్నారని, అక్కడి నుంచి పోటీచేస్తే కబ్జా సొమ్ములతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గంటాకు ఏపార్టీ టిక్కెట్ ఇవ్వొద్దని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు లెక్కలేని. సహజ వనరులున్న విశాఖ అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలున్నా, రాజకీయపార్టీలు చిన్నచూపు చూడడం తగదన్నారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన కులాలకు సీట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో లంక మోహనరావు, సత్యనారాయణ, పుల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

సిఎం జగన్ ఇంటిబాట ఖాయం : జనసేన

ప్రజాశక్తి- సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో ఘోర ఓటమితో సిఎం జగన్ ఇంటిబాట పట్టడం ఖాయమని జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు హెచ్చరించారు.గురువారం పౌరగ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సిఎం జగన్‌లాగా పవన్‌కల్యాణ్‌కు ఊరుకో ప్యాలెస్, అవినీతి సొమ్ముతో సండూర్ పవర్ ,భారతి సిమెంట్, జగతి పబ్లికేషన్స్, ఇందిరా టివి వంటి సంస్థలు లేవన్నారు. కష్టపడి సంపాదించిన సొంత సొమ్మును కౌలురైతులకిచ్చి ఆదుకున్న పవన్‌కు, సొంత చెల్లి, తల్లిని ఇంటినుంచి తరిమేసిన జగన్‌కు పోలిక ఎక్కడని ప్రశ్నించారు. పోలీసులను విపక్షనేతల ఇళ్లకు పంపి బెదిరింపులకు పాల్పడుతున్నారని,ఇదంతా మరో 50రోజులేనన్న విషయాన్ని గుర్తెరగాలని హెచ్చరించారు. జనసేన నేతలు పీతల మూర్తియాదవ్, కెఎస్ఎన్ రాజు ఉన్నారు

కాంగ్రెస్ ఫిషర్‌మ్యాన్ కోఆర్డినేటర్‌గా దేముడు



నియామక పత్రం అందుకుంటున్న దేవుడు

ప్రజాశక్తి -గాజువాక : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కోఆర్డినేటర్‌గా కొవిరి దేముడు నియమితులయ్యారు. ఈ మేరకు ఛైర్మన్ జగన్నాధరావు నుంచి గురువారం నియమక పత్రాలను స్వీకరించారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా తనకు పదవినివ్వడంపై దేముడు ఆనందం వ్యక్తం చేస్తూ, అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

శంకుస్థాపనలేనా.. పనులు చేపట్టరా?

ప్రజాశక్తి-పెందుర్తి : ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలో ఎక్కడికక్కడే లెక్కకుమిక్కిలిగా ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లు శంకుస్థాపనలు చేస్తున్నారని, అయితే ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి. జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి బి. రమణి ఆరోపించారు. కార్మిక నగర్‌లో కాలువలు నిర్మాణానికి .జనవరి 29న శంకుస్థాపన చేయగా, నేటికీ పనులు మొదలెట్టలేదన్నారు. సుజాతనగర్‌లో రోడ్లు మరమ్మత్తులకు శంకుస్థాపన చేసినా పనుల్లో కదలిక లేదు. తక్షణం పనులు ప్రారంభించకుంటే, ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు చేస్తున్న శంకుస్థాపన జిమ్మిక్కులను ప్రజలకు వివరించి, ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కిరణ్మయి రెడ్డికి ఉత్తమ మహిళా శాస్త్రవేత్త అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న కిరణ్మయిరెడ్డి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి రెడ్డికి పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ రంగం, ఆవరణ వ్యవస్థలపై జరిపిన పరిశోధనలకు గుర్తింపుగా సొసైటీ ఫర్ సస్టైనబ్బుల్ అండ్ కన్జర్వేషన్ ఎకాలజీ ఉత్తమ మహిళా శాస్త్రవేత్త అవార్డును అందించింది. న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చిలో జరిగిన ప్రపంచ సదస్సులో ఈ అవార్డును కిరణ్మయిరెడ్డి అందుకున్నారు. వ్యవసాయ, పర్యావరణ సంబంధిత పరిశోధనలలో 17 ఏళ్ల సుదీర్ఘ అనుభవమున్న కిరణ్మయిరెడ్డి 26 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం సహకారంతో ఐఐటీ రూర్కెలాతో కలిసి నీటి సంరక్షణ ప్రాజెక్టుపై ప్రస్తుతం అధ్యయనాలు జరుపుతున్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం బిజినెస్ స్కూల్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో ప్రత్యేక సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ ఆధ్వర్యంలో పాఠశాలలోని బుద్ధి మాంద్యం గల చిన్నారులకు వివిధ పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాల చిన్నారుల్లో ఉత్సాహం నింపడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంబిఎ, తదితర కోర్సుల విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే మహిళలకు గుర్తింపు

అవార్డులు పొందిన మహిళా ఉద్యోగులు

ప్రజాశక్తి -కోటవురట్ల: అంకితభావంతో విధి నిర్వహణలో పని చేసే మహిళలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఇటీవల పలు ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అవార్డు పొందిన మహిళా ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ మాట్లాడుతూ, మహిళలు అని రంగాల్లో రాణిస్తున్నారని, సాంకేతిక పరిజ్ఞానం అందుపుచ్చుకోవడంతో ముందంజలో ఉన్నారని తెలిపారు. మహిళపై అనేక చోట్ల వేధింపులు కొనసాగుతున్నాయని, ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని కోరారు. వెలుగు ఏపీఎం రమణ కుమారి మాట్లాడుతూ, మహిళలు ప్రజా జీవనంలో ప్రత్యేక భూమిక పోషిస్తున్నారని, సమాజంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్న తరుణంలో స్త్రీలు చైతన్యవంతులవుతున్నారని కొనియాడారు. స్త్రీలు అనేక రంగాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటు న్నారని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి ఆషా మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో తమ శక్తిని నిరూపించుకుంటున్నారని, ప్రపంచాన్ని ప్రకాశవంతంగా తీర్చి దిద్దడమే కాకుండా ఎన్నో రంగాల్లో రాణిస్తూ అన్ని రంగాలలోనూ పెను మార్పులు తీసుకు వస్తున్నారని తెలిపారు. పందూరు గ్రామ కార్యదర్శి జోశ్న మాట్లాడుతూ, మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగిందని, కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంలో మహిళలు గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సుంకపూర్ డిజిటల్ అసిస్టెంట్ సరోజినీ దేవి మాట్లాడుతూ, సమాజంలోని కొన్ని ప్రాంతాల్లో మహిళలు పలు రుగ్మతలకు గురవుతున్నారని, వీటిని రూపుమాపే విధంగా మహిళల్లో ఆత్మగౌరవం మరింత పెంపొంది విధంగా ప్రభుత్వాలు, సమాజం సహకరించాలని కోరారు. కుటుంబ సంరక్షణ పోషణ భారంతో పాటు ఉద్యోగ వీధుల్లో మానసిక ఒత్తిడి గురువుతున్నారని తెలిపారు.ఒత్తిడి తగ్గించుకుని తమ బాధ్యతలు ప్రశాంతంగా నిర్వహించాలని మహిళలను కోరారు.

నివాళ్లు అర్పిస్తున్న దమయంతి, తదితరులు

ఘనంగా వెంకటరమణయ్య వర్ధంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంధాల యంలో గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా అయ్యంకి చిత్రపటానికి లక్ష్మీనరసింహరాజు, రామచంద్రుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ మాట్లాడుతూ, గ్రంధాలయ ఉద్యమానికి కృషి చేశారన్నారు.జాతీయ పౌర గ్రంధాలయల స్థాపనలో అయ్యంకి సేవలను పాఠకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

అద్భుతంగా ఆకృతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళా నైపుణ్యంతో శివుని ఆకృతులు అద్భుతంగా తీర్చిదిద్దాడు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా చెక్క పై శివుడు, శివలింగం, శివుని వాహనం చెక్కి తన ప్రతిభను చాటాడు. మహాశివరాత్రి పురస్కరించుకుని తన సూక్ష్మ కళను ప్రదర్శించి తన భక్తిని చాటుకున్నాడు.



శివుని కళారూపం(ఇన్‌సెట్‌లో రవి)

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

-కల్యాణపులోవ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు -ముస్తాబైన శివాలయాలు

ముస్తాబైన కల్యాణపులోవ ఆలయం

ప్రజాశక్తి -కొత్తకోట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన కళ్యాణపులోవ పోతురాజుబాబు (శివాలయం) తిరునాళ్ళకు దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసారు. కల్యాణపులోవ తిరునాళ్ళ ప్రతి ఏడాది మహా శివరాత్రి ని పురష్కరించుకొని మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 8, 9, 10తేదీ లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసారు. ఈ మూడు రోజులు లక్షలాది మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా. ఇప్పటికే జిల్లా ఎస్పి మురళీకృష్ణ, అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.స్నానాల రేవులో మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేసారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, వాలంటీర్స్ ను అందుబాటులో ఉంచారు.తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆధ్వ ర్యంలో భారీ అన్నసమారాధన కు ఏర్పాటు చేస్తున్నారు.కొత్తకోట మెయిన్ రోడ్డు, దొండపూడి ఫారెస్ట్ గేట్, కల్యాణపులోవ ఆలయం గుడి వద్ద ఐదుగురు సీఐ, 27మంది ఎస్ఐలతో పాటు 350 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కొత్తకోట సిఐ అప్పలనాయుడు చెప్పారు.

ధారమట్టంలో డిఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రమైన ధారమట్టం పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భద్రతా ఏర్పాట్లను నర్సీపట్నం డిఎస్పి మోహన్ గురువారం పరిశీలించారు. గొలుగొండ మండలంలో ప్రసిద్ధిగాంచిన దారమట్టం పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం డిఎస్పీ మోహన్ గురువారం దార మట్టం పుణ్యక్షేత్రాన్ని సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ వెంట నర్సీపట్నం రూరల్ సిఐ హరి, గొలుగొండ ఎస్సై కృష్ణారావు పాల్గొన్నారు.

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

కె.కోటపాడు : శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు సిద్ధమయ్యాయి. మండలంలోని ఆర్లి గ్రామంలోని స్వయంభూ శివలింగంతో పాటు చౌడువాడ, గొండుపాలెం, కె.కోటపాడు మేడిచర్ల ఆనందపురం, లంకవానిపాలెం గ్రామంలోని గృహలింగేశ్వర స్వామి, చంద్రయ్యపేట గ్రామంలోని బాట మల్లన్న ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, రాత్రికి రుద్రాభిషేకాలు జరుగుతున్నాయి. కె.కోటపాడు, చంద్రయ్యపేట శివాలయాల్లో అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీ లింగాల తిరుగుడు స్వయంభు శ్రీసోమలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా కోటి దీపార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోరిబిల్లి నూకరాజు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని పేర్కొన్నారు.

అపారిశుధ్యానికి కేరాఫ్ కైలాసపట్నం

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కైలాసపట్నం గ్రామం అపారిశుద్యానికి అడ్డాగా మారింది. గ్రామంలో ఎక్కడ చూసినా మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేక పోవడంతో రాజుపేట వెళ్లే ప్రధాన రహదారి వద్ద వేస్తున్నారు. ఈ చెత్తాచెదార ఎగరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ పరిధిలో కైలాస పట్నం గ్రామం ఒక్కటే ఉన్నా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఇదిలా ఉండగా మండలంలోని తొలిసారి సంపద సృష్టి కేంద్రాన్ని శంకుస్థాపన చేసినా నేటికీ నిర్మాణం పూర్తి కాకపోవడం విశేషం.సంబంధించిన అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించారని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన చెత్తాచెదారం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పాపారావు

17న మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 17న జరిగే రెల్లిల మహాసభను విజయవంతం చేయాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. గురువారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, రెల్లి కులస్తులు అన్ని రంగాలలో వెనుకబాటుకు గురవుతున్నారన్నారు.ఈ మహాసభకు రెల్లిలంతా గ్రామస్థాయి నుంచి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల ఏడుకొండలు, నిమ్మకాయల గురుమూర్తి, పొట్నూరు గోవిందు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి విఆర్‌ఒల నియామకం

ప్రజాశక్తి -కోటవురట్ల: రాజుపేట రెవెన్యూ గ్రామానికి సంబంధించిన విఆర్ఓ గడచిన పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో రాజుపేట సహా ఆయన ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న రామన్నపాలెం, జల్లూరు, సుంకపూరు, రెవెన్యూ గ్రామాలకు ఇన్చార్జిలను నియమించినట్లు కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. సుంకపూరు, జల్లూరు గ్రామానికి చిన్న బొడ్డేపల్లి గ్రామ రెవెన్యూ అధికారి కె.శివను, రాజుపేట రామన్నపాలెం గ్రామాలకు సంబంధించి కోటవురట్ల విఆర్ఓ వి.అప్పారావును ఇన్చార్జిలుగా నియమించినట్లు తెలిపారు.
కాగా మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు గాను 14 మంది వీఆర్వోలు మాత్రమే ఉండడంతో సిబ్బంది అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

'రీ సర్వే నివేదికను బహిర్గతం చేయాలి'

ప్రజాశక్తి -రావికమతం: జగనన్న భూ హక్కు -భూ రక్ష రీ సర్వే అవకతవకలపై అధికారులు చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని మండలంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి భూమి సాగు చేసుకుంటున్న ప్రతి రైతుకు సర్వహక్కులు కల్పించాలన్న ఉద్దేశంతో రీ సర్వేను చేపట్టారన్నారు. దానికి పూర్తి విరుద్ధంగా అధికారులు తూట్లు పొడుస్తూ పక్క తోవ పట్టించారన్నారు. రి సర్వేలో జరిగిన అవకతవకలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ గ్రామంలో సోషల్ ఆడిట్ టీం ద్వారా విచారణ చేపట్టారన్నారు. ఇందుకు సంబంధించి నివేదికను జిల్లా కలెక్టర్కు పంపించి సుమారు 6 నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఎటువంటి స్పందన కనిపించకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారన్నారు.రైతుల పక్షాన పోరాటానికి సర్పంచ్‌గా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

బస్ షెల్టర్ కూల్చివేతపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక పిహెచ్‌సికి వెళ్లే దారిలో ఉన్న బస్ షెల్టర్‌ను కూల్చి వేసిన వారిపై కేసు నమోదు చేయాలని ప్రజాసంకల్ప వేదిక నాయకులు జక్కు నరసింహమూర్తి, ముప్పిన వెంకటరమణ కోరారు. గురువారం గొలుగొండ ఎస్సై కృష్ణారావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం ఉపయోగపడే బస్ షెల్టర్ ను కూల్చివేయడం అన్యాయమన్నారు. కూల్చి వేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రజక కాలనీలో కుళాయి ప్రారంభం

కుళాయి ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ రజక కాలనీలో ప్రజల దాహార్తి సమస్య పరిష్కారమైంది. ఇక్కడ నివసిస్తున్న సుమారు 100 కుటుంబాలకు నిరంతరం తాగునీటి సరఫరాకు కుళాయిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా నీటి సమస్య పరిష్కారానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని, ప్రజలు నీటిని వృథా చేయవద్దని సూచించారు.

అనాథ మహిళకు అండ

అనాథ మహిళకు సాయం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని ఒక ప్రైవేటు నర్సింగ్‌హోం వద్ద రోడ్డు పక్కన ఉన్న అనాథ మహిళకు పలువురు అండగా నిలిచారు. జివిఎంసి ఒకటో వార్డు అధ్యక్షుడు టి.సూరిబాబు మధ్యాహ్న భోజనం అందించగా, అభి కన్‌స్ట్రక్షన్స్ అధినేత బి.శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా వాకింగ్ స్టిక్స్, దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. సాయం చేసిన వారిలో టిడిపి నేత డి.వెంకటేష్, మరికొందరు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -సీతమ్మధార జివిఎంసి 53వ వార్డు శివనగర్ యుపిహెచ్‌సిలో గురువారం నిర్వహించిన ఆరోగ్యసురక్ష వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. జివిఎంసి ఐదో జోన్ ఎఎంహెచ్ఒ డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొని పర్యవేక్షించారు. యుపిహెచ్‌సి డాక్టర్ అంజలి నేతృత్వంలో వైద్యాధికారులు పాల్గొని 300 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు కార్యక్రమంలో సిబ్బంది మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ మధు, స్టాఫ్ నర్సులు ఆశ, కోమలి, సూపర్వైజర్ కె వెంకటలక్ష్మి, ఇంచార్జ్ శివాజీ పాల్గొన్నారు.

సిబ్బంది, రోగుల అవస్థలు

ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఆరుబయటనే నిర్వహించడంతో సరియైన ఫ్యాన్లు, మౌలిక సదుపాయాలు లేక ఎండ తీవ్రతకు రోగులతో పాటు సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు ఏర్పాట్లు కల్పనలో విఫలమయ్యారు.

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి డుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మాత వందన ఆయుష్మాన్ భారత్ యోజన పథకంపై గిరిజనులకు అవగాహన పరచాలని బిజెపి మండల అధ్యక్షుడు కె రమేష్ చెప్పారు. గురువారం పీఎస్సీలోని వైద్య సిబ్బందితో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణీలకు మాత వందన పథకం ద్వారా పలు రకాల సేవలను అందిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా గిరిజనులందరికి ఉచితంగా వైద్య సేవలను అందిస్తుందని చెప్పారు. వీటిపై గిరిజనులకు అవగాహన లేక ఉపయోగించుకోవడంలేదని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు వీటిపై గిరిజనులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వి బలరాం కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఐటిడిఎ పిఒ

సూచనలు చేస్తున్నఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి అనంతగిరి:మండలంలోని పోలింగ్ బూత్‌లను గురువారం పాడేరు ఐటిడిఎ పిఒ వి అభిషేక్ పరిశీలించారు. ఎగువ శోభ పంచాయతీ పరిధి బీసుపురం, ఎగువశోభ, టోకూరు పంచాయతీ ములియాగూడ, శివలింగపురం, డముకు, కాశీపట్నంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు, సిబ్బందికు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని బూతు లెవెల్ బిఎల్వోలకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బాలాజీ పాల్గొన్నారు

అప్పలస్వామికి కన్నీటి వీడ్కోలు

సిపిఎం నేత తియ్యాల పార్థివదేహానికి పలువురి ఘననివాళి

నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు, ఇతర నేతలు, ప్రజలు

అప్పలస్వామికి కన్నీటితో తుదివీడ్కోలు పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 62వ వార్డు, దుర్గానగర్ సిపిఎం శాఖ పూర్వ కార్యదర్శి, సీనియర్ సభ్యులు తియ్యాల అప్పలస్వామికి గురువారం పలువురు మంది అంతిమ కన్నీటి వీడ్కోలు పలికారు గతనెల 20న తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన అప్పలస్వామి, నాటి నుంచి కోమాలోనే విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను బతికించేందుకు ఆపరేషన్, ఇతర చికిత్సలు చేసినా వైద్యానికి శరీరం సహకరించడం లేదని వైద్యులు నిర్ధారించిన తర్వాత గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. తెచ్చిన రెండు గంటల్లోనే అప్పలస్వామి తుదిశ్వాస విడిచారు. అప్పలస్వామి భౌతిక కాయాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, పార్టీ సీనియర్ నేత యువిఎస్ఎన్ వర్మ పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1985 నుంచి తుదిశ్వాస విడిచే వరకు ప్రజల, పార్టీ, మల్కాపురం జోన్, దుర్గానగర్ వాసుల కోసమే సిపిఎం జెండా నీడన నిజాయితీ గల కార్యకర్తగా అప్పలస్వామి పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం కుటుంబసభ్యులకే కాకుండా, పార్టీకి, ప్రజాఉద్యమాలకు తీరని లోటన్నారు. అప్పలస్వామి లేకపోయినా, అతని ఆశయాలను కొనసాగించడమే అతనికిచ్చే ఘననివాళి అన్నారు. సంతాప కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా నేత రొంగలి రాము, పార్టీ మల్కాపురం జోన్ నేత కె.నూక రాజు, ఆర్ లక్ష్మణమూర్తి, ఎల్ కృష్ణ, ఎ.సత్యారావు, వి బాబూరావు, పి సురేష్, ఎస్ అప్పారావు, ఎం నీలకంఠం, కె.రాము, మహిళా సంఘం నాయకులు ఆర్. విమల, పి వర లక్ష్మి, బి రాజేశ్వరి, పి పుణ్యవతి, ఎం జయలక్ష్మి, జి రామలక్ష్మి, కె అన్నపూర్ణ, గ్రామ సంఘం నాయకులు కె.వరదేశ నాయుడు, ఎంఎల్ నాయుడు, ఎం మాలినాయుడు, మల్లేశ్వ రావు, అప్పలస్వామి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, దుర్గానగర్ వాసులు వందలాదిగా తరలివచ్చి, అప్పలస్వామి భౌతికకాయంపై పూలు జల్లి ఘనంగా కన్నీటి వీడ్కోలు పలికారు. దుర్గానగర్ నుండి కోరమండల్ గేటు వద్ద గల శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర జరిగింది. అప్పలస్వామికి ఆయన పెద్దల్లుడు గణేష్ తలకొరివి పెట్టారు. బతికున్నప్పుడు ఆయన కోరుకున్న విధంగా సిపిఎం విధానాలకు అనుగుణంగా అప్పల స్వామికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అప్పలస్వామి జీవిత విషయాలు

విజయనగరం జిల్లా తెర్లాం మండలం కూనావలసకు చెందిన అప్పలస్వామి విశాఖలోని ఆంధ్ర స్టీల్ కార్పొరేషన్ ఫ్యాబ్రికేషన్ డిపార్ట్‌మెంట్‌లో 1980 నుంచి పనిచేశారు. ఇక్కడ సిఐటియుతో బంధం ఏర్పడింది. తరువాత షిప్‌యార్డ్ ఒప్పందంలో గ్యాస్ కట్టర్‌గా, వివిధ పరిశ్రమలలో పని చేశారు. తర్వాత ఎపిఎస్ఆర్‌టిసి కండక్టర్ ఉద్యోగం చేశారు.

ఉద్యమ నేపథ్యం: దుర్గానగర్ యువజన సంఘం వ్యవస్థాపకునిగా, సిపిఎం శాఖ కార్యదర్శిగా, భవన నిర్మాణ కార్మిక సంఘం బాధ్యునిగా, ఆటోరిక్షా ఉద్యోగుల సంఘం ఎస్‌డబ్ల్యుఎఫ్ బాధ్యునిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా, దుర్గానగర్ గ్రామ సంఘం బాధ్యునిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు.

కుటుంబం: అప్పలస్వామి భార్య టి అరుణమ్మ మహిళా సంఘం కార్యకర్త. పెద్ద కుమార్తె సంతోషి ఎఎన్ఎం. పెద్దల్లుడు గణేష్ హెచ్‌పిసిఎల్‌లో పనిచేస్తున్నారు. చిన్న కుమార్తె చైతన్య సెకండరీ గ్రేడ్ టీచరుకాగా, చిన్నల్లుడు శ్రీకాంత్ పోలీస్ ఉద్యోగి.

అన్నసమారాధన

ప్రజాశక్తి- ఆనందపురం: మండలం సిర్లపాలెంలో షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం క్షీరాభిషేకం, విశేష అర్చన, హోమం ఇతర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1500 మందికి అన్నదానం నిర్వహించారు. సాయింత్రం గ్రామ ప్రధానవీధుల్లో సాయిబాబా పల్లకిలో ఊరేగింపు ఉత్సవం, దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోరాడ సత్యారావు, బొప్పడాపు గణేష్, బొప్పడాపు వెంకటరమణ, రమేష్, చందక లక్ష్మణరావు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లతో సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యంలో 42,49వార్డుల పోలింగ్ బూత్ ఏజెంట్లుతో గురువారం సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలనిరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, ఆళ్ళ లీలావతి, శ్రీనివాస్, జెసిఎస్ కన్వీనర్లు బగాతి విజయ్, బులుసు జగదీష్, నీలి రవి పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని కొత్తపాకల గ్రామ సమీపంలో ఫిబ్రవరి 27న జరిగిన హత్య కేసును రంపచోడవరం పోలీసులు ఛేదించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో కేసు వివరాలను సిఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... మండలంలోని కొత్తపాకల గ్రామ సమీపంలో వాగు వద్ద బిల్లా ఆదిలక్ష్మి (31) మృతదేహం ఉందని ఫిబ్రవరి 27న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పలు విషయాలు వెల్లడయ్యాయి. మృతురాలు బిల్లా ఆదిలక్ష్మి, నిందితుడు కొండపల్లి రమణబాబు ఇద్దరూ రాజమండ్రి సమీపంలోని రాయుడుపాకల అట్టల తయారీ ఫ్యాక్టరీలో కూలి పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉండేవారు. ఆదిలక్ష్మి భర్త ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో కొండపల్లి రమణబాబు, ఆదిలక్ష్మి కొద్దిరోజులుగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి గర్భం దాల్చింది. ఫిబ్రవరి 25వ తేదీన ఆదిలక్ష్మితో కలిసి రమణబాబు మడిచర్ల గ్రామానికి వెళ్లి, అక్కడ నుండి 27న రంపచోడవరం వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో మార్గం మధ్యలో ఆదిలక్ష్మికి గర్భం తీయించేందుకు డబ్బులు అడగ్గా రమణబాబు నిరాకరించాడు. దీంతో ఇరువురి మధ్య తగాదా జరిగింది. ఈ క్రమంలో ఆదిలక్ష్మిని కొత్తపాకల సమీపంలోని కాలువ వద్ద రాయికి తలను కొట్టి హత్య చేశాడు. కేసును ఛేదించిన పోలీసులు నిందితుడు రమణబాబును ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

1450 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ఆనందపురం: క్యాబ్‌లో అక్రమంగా తరలిస్తున్న 1450 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎఎస్ఐ చలం తెలిపారు. బుధవారం రాత్రి భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా, ఆరిలోవ నుంచి పెద్దిపాలెం రైస్ మిల్లుకు వ్యానులో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. భీమిలి క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ సిబ్బంది వ్యాను ఆపే ప్రయత్నం చేయగా, వ్యాన్ ఆపకుండా పారిపోయేందుకు యత్నించగా, చెక్‌పోస్టు సిబ్బంది వెంబడించి పట్టుకున్నారన్నారు. వ్యాన్‌ను తనిఖీ చేయగా 1450కిలోల రేషన్ బియ్యం పట్టుబడింది. వ్యాను ఓనర్ అప్పలరాజు, పైలా వాసులను అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు

వాహనాల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- మధురవాడ : వాహనాల చోరీకి పాల్పడిన పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం పాలెం క్రైం ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం కొమ్మాది కూడలి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, పాత మధురవాడ మెట్ట ప్రాంతానికి చెందిన టేకుపూడి కనకరాజు బైక్‌ను ఆపి, వాహనపత్రాలు అడగగా, అతని వద్ద లేకపోవడంతో, అదుపులోకి తీసుకొని విచారించారు. మధురవాడ టైలర్స్ కాలనీలో దొంగిలించినట్లు బైక్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆటో, ఎంవిపి పోలీస్‌స్టేషన్, నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రెండు బైక్‌లను చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని,నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

వాలంటీర్లకు పురస్కారాలిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సిఎం జగన్, వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లే సంక్షేమ వారధులని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం జివిఎంసి ఐదోజోన్ షాదీఖానా కల్యాణ మండపంలో 26, 42, 43, 44వార్డుల వాలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేసి, అభినందించి సత్కరించారు. కోవిడ్ వ్యాప్తి సమయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అందించిన సేవలు మరువలేనివన్నారు కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ళ లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి, దుర్గప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, నాయకులు రేవతిరావు, హబీబ్, బొడేటి కిరణ్, అంబటి శైలేష్, రవిబాబు, పాండవ శ్రీను, అమ్మాజీ పాల్గొన్నారు.

46వ వార్డులో....

వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 46వ వార్డు మధురానగర్, కస్తూరినగర్, శాంతినగర్, సంజీవయ్య కాలనీలో విధులు నిర్వహిస్తున్న 105 మంది సేవా పురస్కార గ్రహీతలకు జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ గురువారం సత్కరించారు జివిఎంసి కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఎపిడి పద్మావతి, సిఒ వరలక్ష్మి, బివి నారాయణరెడ్డి, లావణ్య, రమణ పాల్గొన్నారు.

చదువుతోనే మహిళల రాణింపు

ఎయు బోటనీ విభాగం చైర్మన్ సంధ్యదీపిక

ప్రజాశక్తి- విశాఖపట్నం : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎయు బోటనీ విభాగం చైర్మన్, ప్రొఫెసర్ కె.సంధ్యదీపిక అన్నారు మహిళా దినోత్సవ సందర్భంగా గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ, పదేళ్లుగా ఎయులో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ, ఈనెల 2న బోటనీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. చదువు ద్వారానే ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా , మధ్యతరగతి కుటుంబాల్లోని ఆడపిల్లలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో బాగా చదువుకుని ఉన్నతంగా రాణించవచ్చన్నారు. ఆడపిల్లలకు చదువుతోపాటు మంచి నడవడిక,సంస్కారాన్ని ప్రతి తల్లిదండ్రులూ నేర్పితే మంచిదని అభిప్రాయపడ్డారు.

'రెగ్యులర్' ఉత్తర్వులపై యుఎంహెచ్ఇయు హర్షం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వైసిపి ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది అయిన స్త్రీ, పురుష ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఫార్మాసిస్టులు తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ గురువారం జిఒ ఎంఎస్ నెంబరు 30, 31 ద్వారా ఆదేశాలు ఇవ్వడం పట్ల యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వాలతో 23 సంవత్సరాలుగా పోరాడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రెగ్యులర్ చేస్తూ జిఒలు ఇచ్చిందని పేర్కొన్నారు. మొదటి విడతగా ఇచ్చిన జాబితాలో చిన్న చిన్న కారణాల చేత లేని వారిని కూడా సత్వరమే చేర్చి రెగ్యులర్ చేసేందుకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అంతవరకూ వారికి సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా భవిష్యత్తు పోరాటాలు చేపడతామన్నారు.

24 అసెంబ్లీ, 5 ఎంపీ సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వెలమలకు 5 పార్లమెంటు, 24 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు తెలిపారు. గురువారం వేదిక ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలన్నారు. సమావేశంలో బార్ కౌన్సిల్ సీనియర్ మెంబర్ సిరిపురపు కృష్ణమోహన్, డాక్టర్ బొకం దేముడు, జాగారపు రామునాయుడు, వెన్నెల సూర్యనారాయణ, సిరికి పోతురాజు పాల్గొన్నారు.

బిసిలకు రుణాల పేరిట వైసిపి మోసం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదేళ్ల పాలనలో బిసిలకు వైసిపి నయా పైసా రుణ సౌకర్యం కల్పించలేదని టిడిపి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ బిసిలకు వైసిపి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలు చేసిందన్నారు.

తీరంలో ఏర్పాట్ల తీరును అడిగి తెలుసుకుంటున్న సిపి రవిశంకర్

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా శివరాత్రి సందర్భంగా తీర ప్రాంతాలకు వచ్చే భక్తుల కోసం జరుగుతున్న ఏర్పాట్లును నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం పరిశీలించారు. ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండల్లో ఆయన పర్యటించారు.

రియల్ మి 12 సిరీస్ 5జి ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ ఫోన్ ప్రొవైడర్ రియల్ మికి సంబంధించిన 12 సిరీస్ 5జిని ఆవిష్కరించినట్టు సంస్థ మీడియా టెక్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ అనుజ్ సిద్ధార్థ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తూర్పు నియోజకవర్గం ఎన్నికల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గం ఎన్నికల అధికారులుతో జిల్లా జాయింట్ కలెక్టరు కె.మయూర్ అశోక్ గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అడ్డతీగలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయినిలు

ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాగరతీర కళంజియా సమాఖ్య, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలను చిన వాల్తేరు రజక వీధి సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాఖ్య కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఎంవివిని సత్కరించారు. సభ్యులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జెసిఐ స్త్రీ సంకల్ప నుంచి హెన్నా, అడ్వకేట్ అరుణ, రత్న సమాఖ్య లీడర్స్ దివ్య, పాపమ్మ, సత్య, గోవింద లక్ష్మి, పుష్ప, పూర్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 11వ వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు ఆటపాటలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయిని శాలువతో ఘనంగా సత్కరించారు. గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు.

మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ సివిఎస్ఎస్ శాస్త్రి పలువురు మహిళలను సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినా అఘాయిత్యాలు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సులోచన, పైడిరాజు, జువాలజీ లెక్చరర్ డాక్టర్ షర్మిలశ్రీ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత మహిళలు అన్ని రంగాలలో అత్యున్నత స్థానాల్లో నిలిచి తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. అనంతరం కళాశాల మహిళా విభాగాధిపతులను సన్మానించారు. మహిళా సిబ్బందికి బహుమతులను అందజేశారు. విద్యార్థినులు మహిళా దినోత్సవం పలు నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకొని తుమ్మపాల శారదా వేలి డెవలప్మెంట్ సమితి ప్రాంగణంలో కార్యదర్శి కర్రి జోగినాయుడు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో మహిళలు మహా శక్తులుగా అన్ని రంగాలలో తమ ప్రతిభతో రాణిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు అవసరమయ్యే రుణాలను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సోషల్ వర్కర్ లావణ్య, లుపిన్ కంపెనీ మేనేజ్ వెంకట్, దిశ పోలీస్ స్టేషన్ యస్ఐ రాములమ్మ పాల్గొన్నారు.

పాడేరులో కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎన్.భాను, డాక్టర్ భాషిణి ప్రియాంక జ్యోతిప్రజ్వళన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్. డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్,పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ పి.ప్రసాద్, ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.డయానా పాల్గొన్నారు.

పాడేరు: ఒడిదుడుకులను ఎదుర్కోగిలిగే శక్తిమంతులు స్త్రీమూర్తులు అని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కొనియాడారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలో పాల్గొన్న కలెక్టర్ ప్రసంగించారు. మహిళలు జీవతంలో అనుకున్నది సాధించాలని సూచించారు. సహనమే స్త్రీ మూర్తికి బలమని, వారు శ్రమతో దేన్నైనా సాధించగలరని వివరించారు. సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మహిళల ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లను మహిళలు సత్కరించారు.ఈ కార్యక్రమంలో మినుములూరు సర్పంచ్ చిట్టెమ్మ, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటిలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండెంట్ హర్షిత రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఇంజనీరింగ్ కంపెనీల లోనే కాకుండా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ తదితర ప్రభుత్వ రంగాలలో మహిళలకు అపార అవకాశాలు వున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ జె .రాజమురుగదాస్, మహిళా సాధికార విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్షితరాజును ఘనంగా సత్కరించారు.

అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

డుంబ్రిగుడ: స్థానిక యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో గురువారం మహిళ దినోత్సవాన్ని ఘనంగా ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ఎస్ కన్నయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజారావు, ఎస్.బాలకృష్ణ పాల్గొన్నారు.

అడ్డతీగల : మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిమతి అన్నారు. యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతి కార్యక్రమాలు, ఆట పాటలు, క్యాట్ వాక్‌తో అలరించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కే శ్రీనివాస్, తేజరావు, నాగప్రసాద్, రవణమ్మ, కమల, రత్నం, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హర్షిత రాజు